చవితి సందడి

● గణపతి నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమైన పందిళ్లు
● జోరుగా పత్రి విక్రయాలు

మచిలీపట్నంటౌన్: వినాయక చవితి సందడి ప్రారంభమైంది. చవితి వేడుకలు సోమవారం జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పలు కూడళ్లలో నిర్వాహకులు చలువ పందిళ్లు వేశారు. వినాయక ప్రతిమలు పెట్టి పూజల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాల వద్ద ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం పండుగకు ఆదివారం సాయంత్రం పూజా సామగ్రి, పత్రి కొనుగోళ్లు జోరుగా సాగాయి. మచిలీపట్నంలోని కోనేరుసెంటర్‌తో పాటు ప్రధాన రహదారి వెంబడి వివిధ రకాల పత్రితో పాటు పూలు, పండ్లు పెద్ద ఎత్తున విక్రయాలు జరిగాయి. పత్రి కొనుగోలుదారులతో కోనేరుసెంటర్, ప్రధాన రహదారులు కిక్కిరిశాయి. పిల్లలతో సహా వచ్చి మట్టి గణనాథుని ప్రతిమలు, గొడుగులు, పూలు, పండ్లు కొనుగోలు చేశారు. నగరంలో పలు చోట్ల పందిళ్లు ఏర్పాటు చేసి నవరాత్రులను ఘనంగా నిర్వహించనున్నారు. మాచవరంలోని వినాయక విగ్రహాల తయారీ కేంద్రాల నుంచి నగరంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పందిళ్లలో ఏర్పాటు చేసేందుకు వినాయక విగ్రహాలను ఆనందోత్సాహాలతో వాహనాల్లో తరలించారు. అంతటా చవితి సందడి నెలకొంది.


పెడన: వినాయక చవితి పర్వదినాన్ని ఆనందోత్సాహాలతో జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తమకు నచ్చిన రూపంలోని వినాయకుని ప్రతిమను తీసుకువచ్చి పందిళ్లలో ఏర్పాటు చేసి ఉత్సవాలు జరిపేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. కొన్ని చోట్ల లడ్డూలను వినాయకుని ప్రతిమ చేతుల్లో పెట్టి వేలం వేసేలా ప్రణాళికలు రూపొందించారు. పెడన పట్టణంతో పాటు మండలంలోని వివిధ ప్రాంతాల్లోని గణపతి ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశారు.

బంటుమిల్లి: బంటుమిల్లిలోని పలు కూడళ్ల పత్రి, వినాయక ప్రతిమల కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. పలు సెంటర్లలో చలువ పందిళ్లు నిర్మించారు. వినాయక ప్రతిమలను పెట్టి పూజలకు ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా అరటిపండ్ల ధరలు ఆకాశాన్నంటాయి. సైజును బట్టి రూ. 50 నుంచి రూ. 100 వరకు విక్రయించారు. గణేష్ ఉత్సవాల పూజలు, ఊరేగింపులు ఎటువంటి వివాదాలు, గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు ఎస్‌ఐ ఎ. పైడిబాబు సూచించారు.

కోడూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పల్లెలు చవితి శోభతో కళకళలాడుతున్నాయి. కోడూరులోని ప్రసన్న గణపతి దేవాలయం వద్ద ప్రత్యేక పందిళ్లు ఏర్పాటు చేశారు. గణనాథుడి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. చవితిని పురస్కరించుకొని సోమవారం ఆలయం వద్ద సిద్ధిబుద్ధి సమేత గణనాథుడి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. యర్రారెడ్డివారిపాలెం, లింగారెడ్డిపాలెం, ఉల్లిపాలెం, నక్కవానిదారి, వి.కొత్తపాలెం, నరసింహపురం, పిట్టలంక గ్రామాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.


బందరులో విక్రయానికి సిద్ధంగా ఉన్న పత్రి


ముస్తాబైన కృత్తివెన్ను మండలం గాంధీనగరంలోని విఘ్నేశ్వరస్వామి వారి ఆలయం


పెడనలో విక్రయానికి సిద్ధం చేసిన వినాయకుని ప్రతిమలు


బందరులో గణనాథుని ప్రతిమను వాహనంపై తరలిస్తున్న భక్తులు

క్లుప్తంగా

ఘనంగా గంగానమ్మ సంబరం



గూడూరు: పోసినవారిపాలెంలోని గంగానమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్, వైఎస్సార్ సీపీ నాయకులు పర్ణం పెదబాబు, గౌరిపర్తి రవికుమార్ జాతరలో పాల్గొన్నారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు.

కార్తికేయునికి శాంతి కల్యాణం

మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. నాగపుట్ట, నాగవల్లివృక్షం, పొంగళ్లశాల వద్ద రద్దీ కనిపించింది. స్వామివారి నిత్య శాంతి కల్యాణంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఏసీ ఎన్. సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎకనామిక్స్ (అర్థ శాస్త్రం) అధ్యాపకునిగా పని చేయుటకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. జగన్ మోహన్‌రావు ఒక ప్రకటనలో కోరారు. ఎంఏ ఎకనామిక్స్‌లో 55 శాతం మార్కులతో ఎల్‌ఎల్ ఈటీ, పీహెచ్‌డీలో ఏదైనా ఒకటి పూర్తి చేసిన వారికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు పూర్తి వివరాలతో ఈ నెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు కాలేజీలో సంప్రదించాలని కోరారు.

జూదరుల అరెస్ట్

కోడూరు: పేకాట శిబిరంపై కోడూరు పోలీసులు ఆదివారం దాడి చేశారు. మందపాకల శివారు చింతకోళ్ల గ్రామంలో పేకాట శిబిరం కొనసాగుతుందన్న సమాచారంలో ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.2,150 నగదును స్వాధీనం చేసుకున్నారు.

సమస్యల పరిష్కారానికే పర్యటనలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కె. కొత్తపాలెం(మోపిదేవి): ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే గ్రామంలో పర్యటిస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కె. కొత్తపాలెం గ్రామ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని ఉత్తరపాలెం, కొత్తపాలెం దళితవాడలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన తనయుడు వికాస్ బాబు గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వివరించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్గత రహదారులు పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని, గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను ఆయా శాఖల అధికారులతో చర్చించి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కొత్తపాలెం గొడపాలెంలోని అంకమ్మ తల్లిని దర్శించుకున్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ మత్తి వెంకట రాజాచంద్, ఎంపీటీసీ సభ్యులు మత్తి లత, సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు తుటారం కృష్ణ, ఆది రాంబాబు, గరికిపాటి గోవిందరాజులు, రెడ్రౌతు వెంకటరమణ, రావి రాంప్రసాద్, తోట కృష్ణాంజనేయులు, లింగం జగదీష్ కుమార్, పాలిమెట్ల వెంకటేశ్వరరావు, యాకోబు, మత్తి రాంప్రసాద్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మద్యం మత్తులో యువకుడి ఆత్మహత్యాయత్నం



కోడూరు: మద్యం మత్తులో ఓ యువకుడు కృష్ణానదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోడూరు గ్రామానికి చెందిన బచ్చు గణేష్ అధిక మొత్తంలో మద్యం సేవించి, ఉల్లిపాలెం-భవానీపురం వారధి వద్దకు వెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న గణేష్ వారధి పైనుంచి కృష్ణా నదిలోకి దూకాడు. అదే సమయంలో వారధి వద్దకు బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి గణేష్ నదిలో దూకడాన్ని గమనించి యువకుడిని కాపాడి ఒడ్డుకు చేర్చాడు. గణేష్ స్పృహ కోల్పోవడంతో 108 వాహనంలో ప్రథమ చికిత్స నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

దోమల నివారణకు చర్యలు

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కొత్తపేట, తిప్పపాలెంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఈ గ్రామాల్లో పలువురు విష జ్వరాలతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ సర్పంచ్ గొరుముచ్చు ఉమా, ఈఓ తోట శ్రీనివాసరావు మురుగు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించి, దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. సర్పంచ్ ఉమా మాట్లాడుతూ దోమల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు.

రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ



ఘంటసాల(అవనిగడ్డ): గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రైతులకు భూ హక్కు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎంపీపీ వేమూరి రజనీకుమారి అన్నారు. ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం జగనన్న భూ రక్ష, భూహక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని బిరుదుగడ్డ, ఎండకుదురు గ్రామాలకు చెందిన 265 మంది భూ యజమానులకు భూ హక్కు పత్రాలను ఎంపీపీ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, తహసీల్దార్ బి. రామానాయక్, దాలిపర్రు సర్పంచ్ డోకిపర్తి శాంతకుమారి, డీటీ పి. శ్రీనివాసరావు, సచివాలయ మండల కన్వీనర్ వేమూరి ప్రవీణ్, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి

మచిలీపట్నంటౌన్: ఎస్సీల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక మల్కాపట్నంలోని తన నివాసం వద్ద వివిధ జిల్లాల నుంచి విచ్చేసిన దళిత సంఘాల నాయకులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ సిద్ధాంతాన్ని నమ్మి ముందుకు సాగుతున్న తనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించారన్నారు. ఎస్సీల సమస్యల పరిష్కారానికి కృషి చేసే అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన దళిత సంఘాల నాయకులు, విక్టర్‌ప్రసాద్ అభిమానులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలను సందర్శించిన పేర్ని

● వసతుల పరిశీలన
● విద్యార్థులతో మాటామంతి

కోనేరుసెంటర్: బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలో వసతులను పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డైనింగ్ హాల్‌ను, హాస్టల్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం రుచికరంగా ఉంటున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి వసతులపై సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం ఆయన ఎంబీబీఎస్ విద్యార్థులతో ముచ్చటించారు. కళాశాలలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలిగినా, వసతుల విషయంలో అభ్యంతరాలు ఉన్నా, ఇతరత్రా సమస్యలు ఏమైనా ఉన్నా నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. వాటి పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామని చెప్పారు. ప్రతి విద్యార్థి పోటీతత్వంతో విద్యను అభ్యసించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్వపడేలా మచిలీపట్నం మెడికల్ కళాశాల కీర్తిని చాటాలని చెప్పారు. విద్యార్థులు పేర్ని నానితో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.


మెడికల్ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న పేర్ని నాని

హంసలదీవిలో స్వచ్ఛ సాగర్

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు, మత్స్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాలకాయతిప్ప బీచ్ నుంచి పవిత్ర కృష్ణా సాగర సంగమ ప్రాంతం వరకు పోలీసులు, మత్స్య శాఖాధికారులు శుభ్రపర్చారు. తీరంలో పేరుకుపోయిన చెత్తాచెదారం, ముళ్లకంప, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి దహనం చేశారు. సముద్ర కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులు తీరంలో వ్యర్థాలు వేయకుండా చెత్తకుండీల్లో మాత్రమే వేయాలని సూచించారు. స్వచ్ఛ సాగర్‌పై అవగాహన కల్పిస్తూ భావదేవరపల్లి ఫిషరీస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మెరైన్ సీఐ వల్లభనేని పవన్ కిషోర్, ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణ, ఎస్‌ఐ జిలానీ, రైటర్ రెహ్మాన్ జానీ, వీఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగరతీరం పరిశుభ్రతను కాపాడుకుందాం

కృత్తివెన్ను: ఎంఓఈఎస్, మత్స్యకార సంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆదివారం చినగొల్లపాలెం బీచ్‌లో స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నిర్వహించారు.
తీరం వెంబడి ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ఏరివేసి బీచ్‌ను శుభ్రం చేశారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ శాస్త్రవేత్త శివయ్య, ఎఫ్‌డీఓ నాగాంజని మాట్లాడుతూ కార్యక్రమ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సునీల్, ఎంపీటీసీ మహాలక్ష్మణుడు, మెరైన్ ఎస్‌ఐ రామకృష్ణ, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.


సాగర తీరంలో వ్యర్థాలను తొలగిస్తున్న పోలీసులు, అధికారులు

మకరతోరణం సమర్పణ

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని వినాయకుడి గర్భాలయంలో స్వామివారికి రూ.28 వేలు విలువైన ఇత్తడి మకర తోరణాన్ని విజయవాడకు చెందిన దాతలు పిచ్చుక శ్రీనివాస్, సుజాత, రోహిత్‌లు సమర్పించారు. ఆదివారం సాయంత్రం సంబంధిత మకరతోరణాన్ని వారి వియ్యంకుడైన మెండు భాస్కరరావు (సాయిరామ్) దంపతులు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివ సత్యవతి దంపతులకు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

బంటుమిల్లి: పెదతుమ్మిడి సెంటర్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ముదినేపల్లి మండలం వైవాక గ్రామానికి చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనంపై పెదతుమ్మిడి వస్తూ సెంటర్‌లో ఆగి ఉన్న గుడివాడ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను బందరు ఆస్పత్రికి తరలించారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి వేడుకలు

కోడూరు: విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవం భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలను కోడూరులో ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వినాయకుడి గుడి సెంటర్‌లో విశ్వకర్మ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడంపై విశ్వబ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ ముద్దినేని చంద్రరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చల్లపల్లి: విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగగా ప్రకటిస్తూ జీఓ ఇవ్వడం హర్షణీయమని చల్లపల్లి ఎన్జీఓ యూనిట్ అధ్యక్షుడు పూసపాటి బ్రహ్మానందరావు అన్నారు. స్థానిక విజయవాడ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆలయం ఎదుట విశ్వకర్మ ధ్వజం ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.


కోడూరులో పూజల్లో పాల్గొన్న జెడ్పీటీసీ, కమిటీ సభ్యులు

జాతీయ కార్మిక దినోత్సవం

అవనిగడ్డ: స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో జాతీయ కార్మిక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి అద్దంకి సాంబశివరావు, ఏజెంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

67వ సారి రక్తదానం

చల్లపల్లి: రక్తదాత కస్తూరి విజయ్‌కుమార్ 67వ సారి రక్తదానం చేశారు. ఆదివారం మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణీకి అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో విజయ్‌ను సంప్రదించారు. తన పుట్టిన రోజు వేడుకలు సాయంత్రానికి వాయిదా వేసుకుని మచిలీపట్నం వెళ్లి రక్తదానం చేశారు.